క్లుప్తంగా

వెంకటాద్రి క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, శరగడం చిన అప్పలనాయుడు

సింహాచలం: పెందుర్తి వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం 2023 క్యాలెండర్ ఆవిష్కరణ ఆదివారం వెంకటాద్రిపై ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు శరగడం చిన అప్పలనాయుడు, 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, 96వవార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు ఆలయ ప్రాంగణంలో క్యాలెండర్ ఆవిష్కరించారు. భక్తులకు పంపిణీ చేశారు.

వరుదు కల్యాణికి శుభాకాంక్షలు



వరుదు కల్యాణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: ఎమ్మెల్సీ వరుదు కల్యాణి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులు కావడంతో ఆమెను 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపాశారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు ప్రత్యేక ఆహ్వానితుడు చందు యాదవ్, 95వవార్డు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు చిప్పల చందు, నాయకులు బొడ్డు దేవుడుబాబు, కంచిబోయిన సంతోష్, కొత్తపల్లి అప్పలరాజు, మురళి, సదాశివుని రవితేజ ముమ్మన దేముడు వెంట ఉన్నారు.

యువశక్తి బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ

సబ్బవరం: శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో ఈ నెల12న జనసేన ఆధ్వర్యంలో నిర్వహించనున్న యువశక్తి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి తమ్మిరెడ్డి శివశంకర్ పిలుపునిచ్చారు. సబ్బవరంలోని జనసేన కార్యాలయంలో ఆ పార్టీ నాయకులతో కలిసి ఆదివారం బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేయాలి



డీఈవోను కలిసిన ఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ ఖగేశ్వరరావు

పరవాడ: విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ, స్కూల్ గ్రీన్ ప్రోగామ్స్‌లో అవగాహన పెంపొందించడానికి వీలుగా పాఠశాల స్థాయిలో ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి లింగేశ్వరరెడ్డి సూచించారు. నేషనల్ గ్రీన్ కోర్(ఎన్‌జీసీ) జిల్లా కోఆర్డినేటర్ నియమితులైన ఎస్.ఖగేశ్వరరావు డీఈవో లింగేశ్వరరెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. డీఈవో మాట్లాడుతూ జిల్లాలోని ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ మోడల్ పాఠశాలల్లో ఎకో క్లబులు ఏర్పాటు చేసి వాటిలో విద్యార్థులను భాగస్వాములను చేసి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, పరవాడ క్లస్టర్ కో ఆర్డినేటర్ బుడుమూరు అన్నాజీరావు పాల్గొన్నారు.

రెండు ఆటోలు ఢీ

కూర్మన్నపాలెం : మద్యం మత్తులో ఆటోను ఢీకొట్టిన ఘటనలో మొత్తం ఎనిమిది మంది గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్లితే ఆదివారం గాజువాక నుంచి అగనంపూడి వైపు ఒకదాని వెనుక ఒకటి ఆటోలు వెళుతున్నాయి. వెనుక ఆటో నడుపుతున్న కిల్లంపల్లి శ్రీకాంత్ మద్యం మత్తులో ముందు వెళుతున్న ఆటోను శివాజీనగర్ వద్ద బలంగా ఢీకొట్టాడు. దీంతో శ్రీకాంత్ నడుపుతున్న ఆటో బోల్తా పడింది. ఇందులో ప్రయాణిస్తున్న నలుగురు ప్రయాణికులతో పాటు శ్రీకాంత్ కూడా గాయపడ్డాడు. ముందు ఆటోలో ముగ్గురు గాయపడ్డారు. దువ్వాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటాద్రి.. ఆధ్యాత్మిక ఝరి



వెంకన్న ఉత్సవమూర్తులు



సామూహికంగా హారతి అందజేస్తున్న భక్తులు

- ఘనంగా సుదర్శన హోమం
- విశేషంగా పుష్పయాగం



పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ముమ్మన దేముడు

సింహాచలం: పెందుర్తి వెంకటాద్రి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. గోవింద నామస్మరణ మార్మోగింది. ఇక్కడ నిర్వహించిన సుదర్శన హోమం, పుష్పయాగంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలోని హోమగుండం వద్ద సుదర్శన పెరుమాళ్‌ను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. అలాగే శ్రీదేవి, భూదేవి సమేతంగా వెంకన్న ఉత్సవమూర్తులను వేదికపై వేంజేపచేసి పుష్పయాగం వైభవంగా చేశారు. గోదాదేవికి కుంకుమార్చన నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దంపతులు, వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు శరగడం చిన అప్పలనాయుడు, 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, 96వవార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు సుదర్శన హోమంలో పాల్గొన్నారు. దేవస్థానం ఈవో నీలిమ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయ అర్చకుడు రామనుజమ్, వైదికులు అనంతాచార్యులు తదితరులు కార్యక్రమాలను నిర్వహించారు.

అట్టహాసంగా ధనుర్మాస పూజలు



సింహగిరిపై గోదాదేవికి హారతి ఇస్తున్న అర్చకుడు

సింహాచలం: ధనుర్మాస పూజలు పలు ఆలయాల్లో అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. సింహగిరితో పాటు పెందుర్తి వెంకటాద్రిపై కొలువైన వెంకన్న ఆలయంలో ఈ పూజలు అత్యంత వైభవంగా జరగుతున్నాయి. సింహగిరిపై తెల్లవారుజామున స్వామికి సుప్రభాత సేవ అనంతరం విశేష ఆరాధన, చతుర్వేద పారాయణం, ఉపనిషత్తు పారాయణం, తిరుప్పావై సేవాకాలం నిర్వహించారు. గోదాదేవికి బేడామండపంలో తిరువీధి వైభవంగా చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ తదితరులు పూజలు చేశారు.

వెంకటాద్రిపై ..

పెందుర్తి వెంకటాద్రిపై గోదాదేవికి, వెంకటేశ్వరస్వామికి విశేషంగా పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు సామూహికంగా ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ ఈపూజలను నిర్వహించారు.

వెంకన్న ఆలయంలో....

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి అమ్మవారికి విశేష అలంకరణ చేసి వేదికపై అధిష్టంపజేశారు. తిరుప్పావై సేవాకాలం, పాశుర విన్నప పారాయణ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు భార్గవ్ తదితరులు పూజలు చేశారు.

సంక్రాంతి కానుకగా డివిడెండ్ల పంపిణీ

- అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి



మహాజన సభలో మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి

సింహాచలం: సకాలంలో రుణాలు చెల్లించి సొసైటీ అభివృద్ధికి సంఘ సభ్యులంతా సహకరించాలని అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి కోరారు. సొసైటీ మహాజన సభ ఆదివారం అడవివరం ప్రియాగార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలస్వామి మాట్లాడారు. సొసైటీలో పేరుకుపోయిన బకాయిలు చాలా ఉన్నాయని వాటిని రికవరీ చేసేందుకు పాలకవర్గం సమష్టిగా కృషి చేస్తోందన్నారు. ముఖ్యంగా 2015 మార్చి 31వరకు బకాయిలు చెల్లించని వారికి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా క్లియర్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్టు తెలిపారు. వారి రుణాలను బట్టి 18 శాతం వడ్డీ నిర్ణయించడం జరుగుతుందన్నారు. గ్రాము బంగారానికి ప్రస్తుతం ఇస్తున్న రూ. 3వేల రుణాన్ని రూ. 3,200లకు పెంచుతున్నట్టు ప్రకటించారు. 12 వడ్డీ మాత్రమే బంగారంపై రుణం వసూలు చేయడం జరుగుతుందన్నారు. 2019 మార్చి 31లోపు బంగారు రుణాలు చెల్లించని వారంతా లోన్లు క్లియర్ చేసుకోవాలని, వారందరికీ ఎక్స్‌ట్రా 2 శాతం వడ్డీ తగ్గించడం జరుగుతుందని పేర్కొన్నారు. మార్ట్‌గేజ్ రుణాలు రూ. 25లక్షలకు పెంచుతున్నట్టు ప్రకటించారు. సంక్రాంతి కానుకగా ఈనెల 12 నుంచి సభ్యులకు డివిడెండ్లు పంపిణీ చేస్తామని ప్రకటించారు. షేర్‌క్యాపిటల్‌పై 20 శాతం, త్రిఫ్ట్ డిపాజిట్‌పై 8 శాతం కలిపి డివిడెండ్ల రూపంలో చెల్లించడం జరుగుతుందని వెల్లడించారు. కాగా సొసైటీ తరఫున పెట్రోల్‌బంక్, సూపర్‌మార్కెట్, గ్యాస్ ఏజెన్సీ నిర్వహించాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు లేబర్ యాక్ట్ వర్తింపజేయాలని మాజీ సభ్యుడు సతివాడ శంకరరావు కోరారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు బంటుబిల్లి మహేశ్వరరావు, డైరెక్టర్లు కొలుసు గురునాథరావు, గేదెల కృష్ణం నాయుడు, బోర ప్రసాదరెడ్డి, ఆకుల నాగరాజు, పాలూరి సూరిబాబు, లండ వెంకటరమణ, గునిశెట్టి శ్రీనివాసరావు, కోరాడ ఈశ్వరరావ, పోలవరపు రాజకుమారి, సొసైటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత వివేకానంద



స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రమణబాబు తదితరులు



రక్తదానం చేస్తున్న యువత

పరవాడ: నేటి తరం స్వామివివేకానందను స్ఫూర్తిగా తీసుకుని సన్మార్గం వైపు నడవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి మొల్లి రమణబాబు అన్నారు. ముత్యాలమ్మపాలెంలో స్వామి వివేకానంద 160వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ ప్రతినిధులు, ఉపాధ్యాయులు స్వామి వివేకానంద చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో ముత్యాలమ్మపాలెం యూత్ సభ్యులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో పూడిమడక ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయురాలు మోహినిదేవి, ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు బంధం పైడిరాజు, చింతకాయల కొర్లయ్య, కార్యదర్శి బండారు సోమునాయుడు, ఎంపీటీసీలు అరిజిల్లి దేవిరవి, సూరాడ బంగారాజు, నాయకులు ఎస్.మసేను, పుష్యమిత్ర, నూకరాజు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న వెంకటరామిరెడ్డి



వెంకటరామిరెడ్డికి ప్రసాదం అందజేస్తున్న టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కనకరాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం మెడికల్ అండ్ హెల్త్ డైరెక్టర్ వెంకటరామిరెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి ప్రసాదం టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కనకరాజు ఆయనకు అందజేశారు.

బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పేరుతో టోకరా

- మిథిలాపురి వుడా కాలనీలో రూ.20 వేలు వసూలు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు మిథిలాపురి వుడా కాలనీలో భవనంపై అదనపు స్లాబు వేయాలని భావిస్తున్న ఇంటి యజమాని నుంచి ఓ వ్యక్తి జీవీఎంసీ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పేరుతో రూ.20 వేలు వసూలు చేసి పరారయ్యాడు. దీనికి సంబంధించి బాధితుడు, మిథిలాపురి వుడా లే అవుట్స్ నివాసితుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు త్రిమూర్తులు రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీలో ఉన్న అపోలో డయాగ్నోస్టిక్స్ భవనంపై అదనపు స్లాబు వేయించాలని నిర్ణయించుకున్నారు. దీని కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ విషయం తెలుసుకుని ఓ వ్యక్తి ఆయన దగ్గరకి వచ్చి తాను కొత్త బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌ను అని, తన పేరు దాట్ల శ్రీనివాసరాజు అని చెప్పి నమ్మించాడు. అన్నీ చూసుకుంటానని, ఫిబ్రవరి 5 నుంచి పనులు కూడా చేసుకోమని చెప్పడంతో నిజమేనని నమ్మారు. రూ.30 వేలు ఇస్తే అనుమతి ఇప్పిస్తానని నమ్మించాడు. దీంతో ముందుగా రూ.20 వేలు ఇచ్చారు. నగదు ఇచ్చిన తర్వాత సచివాలయ సిబ్బందిని వాకబు చేయడగా వారు ఎవ్వరూ జీవీఎంసీలో లేరని చెప్పారు. దీంతో అధికారులకు ఫిర్యాదు ఇస్తానని త్రిమూర్తులురాజు చెప్పారు.

యునైటెడ్ ప్యానల్‌కు పూర్తి సహకారం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఓబీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలుపొందిన జ్యోతిరావు పూలే యునైటెడ్ ప్యానల్‌కు పూర్తి సహకారం అందిస్తామని ప్రస్తుత గుర్తింపు సంఘం, జ్యోతిరావు పూలే ఫౌండర్స్ ప్రధాన కార్యదర్శి నక్క వెంకటరమణ తెలిపారు. తమ హయాంలో ఓబీసీ ఉద్యోగుల కోసం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. యాజమాన్యంపై ఒత్తిడి చేసి అసోసియేషన్ కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల్లో తమపై నమ్మకం ఉంచి ఓటు వేసిన 864 మంది ఓబీసీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో గెలిచిన యునైటెడ్ ప్యానల్ పాలకవర్గం ఓబీసీ ఉద్యోగుల కోసం మంచి కార్యక్రమాలు చేపట్టగలరన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగుల కోసం చేసే కార్యక్రమాలకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కూర్మన్నపాలెం : గోదావరి రెడ్డి వేల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నుకొన్నారు. ఈ కార్యవర్గంలో అసోసియేషన్ అధ్యక్షుడిగా తాడి శ్రీనివాసరెడ్డి, సెక్రటరీగా రత్నరెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా అమ్మిరెడ్డి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకొన్నారు. నూతన కార్యవర్గ సభ్యులతో గౌరవాధ్యక్షుడు డాక్టర్ బుల్లయ్యరెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు.

వరదరాజస్వామిగా దర్శనమిచ్చిన అప్పన్న



వరదరాజస్వామి అలంకరణలో అప్పన్న

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వరదరాజస్వామిగా దర్శనమిచ్చాడు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వరదరాజస్వామిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకిలో వేంచేయజేశారు. ఆళ్వారులను మరో పల్లకిలో అధిష్టంపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. అర్చకుడు కుమారాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు



యజ్ఞోపవీతాన్ని సమర్పిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వామికి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలకు పుష్పాలంకరణ చేసి ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేసి 108 స్వర్ణ తులసీ దళాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు పూజ నిర్వహించారు. ఆలయ ఏఈవో నరసింహరాజు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను కల్యాణమండపంలో అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు,ప్రసాదం అందజేశారు.ఆలయ ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు తదితరులు కల్యాణం నిర్వహించారు.

అంధుల ఆరాధ్యుడు బ్రెయిలీ



మాట్లాడుతున్న అజయ్‌రాజ్

పరవాడ: అంధులకు ఆదర్శంగా లూయిస్ బ్రెయిలీ నిలిచారని.. ఆరు చుక్కలతో అంధుల జీవితాల్లో వెలుగులు నింపారని పెందుర్తి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్ అన్నారు. విశాఖ ఉమ్మడి జిల్లా అంధుల సమాఖ్య ఆధ్వర్యంలో మరిడిమాంబ కల్యాణమండపంలో లూయిస్ బ్రెయిలీ 214 జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అజయ్‌రాజ్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం మండల కేంద్రంలో శాశ్వత భవనం మంజూరుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అంధులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు కోరారు. రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీని ఆదర్శంగా తీసుకొని అంధులు ముందుకు సాగాలన్నారు. సాధన సంస్థ కార్యదర్శి షేక్ ఇస్మాయిల్ , విశాఖ జిల్లా అంధుల ఫెడరేషన్ అధ్యక్షుడు ఎస్.అర్జునరావు మాట్లాడుతూ 30 ఏళ్లుగా అంధుల హక్కుల కోసం పోరాడుతున్నామని చెప్పారు. అనంతరం రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన 400 మంది అంధులకు బహుమతులు అందజేశారు. ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం సీఎం జగన్‌తోనే సాధ్యం



అప్పన్న ఆలయంలో కరుణాకరరెడ్డి

సింహాచలం: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలతో పాటు అగ్రవర్ణ పేదలను కూడా ఆదుకుంటున్న ఏకైక ముఖ్యమంత్రిగా వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలుస్తారని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకరరెడ్డి తెలిపారు. సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం ఆయన దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏరాష్ట్రంలోను లేని సంక్షేమ పథకాలను రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమల్లో కేంద్ర ప్రభుత్వం విధించిన నిబంధనలను సరళీకృతం చేసి రాష్ట్రంలో రూ. 8లక్షల ఆదాయ పరిమితి పెట్టడం హర్షణీయమన్నారు.

ప్రజా ఉద్యమంగా ఉక్కు పోరాటం



దీక్షా శిబిరంలో కూర్చున్న మంత్రి రాజశేఖర్, నిర్వాసితులు

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అని, దానిని ఎలా ప్రయివేటుపరం చేస్తారని మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులు నడుపూరు గాంధీ పార్కు ఎదుట ఆదివారం ఉదయం 8 గంటలకు 24 గంటల నిరాహారదీక్షను ప్రారంభించారు. వీరి దీక్షకు నడుపూరు గ్రామ ప్రజలు, కాంట్రాక్ట్ కార్మికులు, స్టీల్ కార్మికులు, అఖిల పక్షాల కార్మిక సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు సంఘీభావం తెలిపారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణపై కేంద్రం ప్రభుత్వం నిర్ణయం వెనక్కి తీసుకునే వరకూ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ పోరాటాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని డిమాండ్ చేశారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



అప్పికొండ తీరంలో కలిసిన పూర్వ విద్యార్థులు

పెదగంట్యాడ: పూర్వ విద్యార్థులు సందడి చేశారు.. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.. ఆలింగనం చేసుకుని గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994–95లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అప్పికొండ తీరంలో ఆత్మీయ సమ్మేళనంలో కలిశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా ఒక అసోసియేషన్‌గా ఏర్పడ్డారు.. తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నా మన్నారు. వారు తమకు విద్యను బోధించిన గురువులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వుడా నూకరాజు, పెంటబాబు, కర్రి మాణిక్యం, మహ్మద్ సఫీ, నజీర్, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.